# సంపన్నులు

"కారాపు. గేటు ముందర ఎవరో పడినట్టున్నారు" సుధాకర్ కేక పెట్టాడు.

గేటుముందర కారాపి దిగి చూశాము డ్రైవరు శివయ్య "ఎవడో తాగి పడ్డాడు" అనుకుంటూ నేలమీద పడిఉన్న మనిషిని పక్కకులాగి గేటుతెరిచి కారు లోపలికి పోనిచ్చాడు.

సుధాకర్ కారుదిగి గేటు దగ్గరకొచ్చి, పడిపోయిన మనిషిని టార్చివేసి చూశాడు. ఎక్కడా దెబ్బలు తగిలినట్లు కనబడలేదు. చెయ్యి పట్టుకు చూశాడు. నాడి నీరసంగా కొట్టుకుంటోంది.

రాత్రి పదిగంటలు దాటింది. సుధాకర్ సాధారణంగా పన్నెండు దాటితేనే గాని క్లబ్బునుంచి ఇంటికిరాడు. అప్పుడతని డ్రైవరు పట్టుకుని లోపలికి తీసుకు వెళ్తాడు. ఆతడి భోజనం బల్లమీద పెట్టి ఉంటుంది కనుక ఒక్కొక్కరోజు భోజనం చేస్తాడు. ఒక్కొక్కరోజు సరాసరి గదిలోకి వెళ్ళి పడుకుంటాడు. అప్పటికి పిల్లలు నిద్రలో ఉంటారు. భార్య సౌగంధి అతడి కోసం ఎదురు చూడటం మానుకున్నది. ఆమెకూడా నిద్రకొరుగుతున్నది. నౌకరు రంగన్న యజమాని పడుకున్న తరువాత కారు తాళాలూ, గేటుకు వేసిన తాళాలూ, బల్లమీద పెట్టి యజమానురాలికి చెప్పి తన గదిలోకి వెళ్తాడు.

ఇదీ మామూలుగా ఆ యింట్లో జరిగే దినచర్య.

ఆ రోజున సుధాకర్ పదిగంటలకే ఇంటికి రావటం, గేటు దగ్గర పడిఉన్న మనిషిని చూడటం, కారు అందుకోసం ఆపించటం, డ్రైవరుకూ నౌకరు రంగన్నకూ ఆశ్చర్యంగా ఉంది. పైగా యజమాని రంగన్నను పిలిచి "బల్లమీద ఉన్న ఫ్లాస్కులో టీ ఉంటుంది తీసుకురా" అని కేకపెట్టాడు. రంగన్న ఒక గ్లాసులో టీ తీసుకొచ్చాడు.

"వాడి గొంతులో కొద్ది కొద్దిగా టీ పొయ్యి" అన్నాడు సుధాకర్.

టీ గొంతులోకి దిగుతున్నకొద్దీ ఆ మనిషిలో కొద్దిగా కదలిక కనబడ్డది. కొంతసేపటికి మూలగటం మొదలు పెట్టాడు. గ్లాసునిండా తాగిన తరువాత రంగన్న ఆసరాతో లేచి సుధాకర్‌ను చూసి భయంతో "బాబయ్యా" అంటూ రెండు చేతులెత్తి దణ్ణం పెట్టాడు. అతడి కంఠంలోనుంచి మాట హీనస్వరంతో వినబడుతోంది.

"ఎవరునువ్వు? గేటుకు అడ్డంగా పడ్డావెందుకు? బాగాతాగి వచ్చావా?" అప్పటివరకు అక్కడ నిలబడిఉన్న సుధాకర్ అడిగాడు.

"లేదు బాబయ్యా, ఊరి కాడినుంచి పదికోసులు నడుచుకుంటూ వస్తుండా. నిన్న పొద్దుగల గంజినీళ్ళుతాగి ఊరువిడిచి బయలెళ్ళిన. కడుపులోకి తిండిలేక కళ్లు తిరిగినయ్ బాబయ్యా. మా నాయన తాగి తాగి చచ్చిపోయిండు మాయమ్మ తనమీద ఒట్టు వేయించుకున్నది. 'తాగనని' నాచేత నేను కల్లుబొట్టెరగను బాబయ్యా."

"ఈ ఊరెందుకొచ్చావు?"

"ఊళ్ళో పనిలేదు బాబయ్యా. కూలి చేసుకుని బతుకుదామని వచ్చిన"

అతడు ఎక్కువసేపు నిలబడలేక గేటు కానుకున్నాడు.

"రంగన్నా, బల్లమీద టిఫిన్ కారియర్‌లో పెట్టిన అన్నం కూరలూ ఆకులో పెట్టి తీసుకురా"

అతడు ఆకులో పెట్టిన అన్నం కలుపుకొని తింటూ ఉండగా సుధాకర్ లోపలికివెళ్ళి బట్టలుమార్చుకొని మళ్ళీ బయటికి వచ్చాడు. అప్పటికీ అతడు అన్నంతిని చెంబెడు నీళ్ళుతాగి, సుధాకర్ రాగానే "నా పేనం నిలబెట్టినారు బాబయ్యా" చేతులెత్తి మళ్ళీ దణ్ణం పెట్టాడు.

"నీ పేరు ?"

"జోగులు బాబయ్యా"

"కారుపెట్టినచోట ఒక అరుగుంది. దానిమీద పడుకో" తెల్లవారి లేచిన తరువాత మాట్లాడుతాను." అని అతడికి చెప్పి రంగన్నను పిలిచాడు.

చేతులు కట్టుకుని రంగన్న రాగానే "వాడక్కడ పడుకుంటాడు. కని పెట్టిచూడు" చెప్పి లోపలికి వెళ్ళి తలుపులేసుకున్నాడు.

బల్లముందర కూర్చుని కారియర్‌లోఉన్న ఆ కొద్దిఅన్నం పెరుగుతో తిన్నాడు. రెండు అరటిపళ్ళు తిన్నాడు. అతడికి నిద్రరావటంలేదు. తన దిన చర్య ఈనాడు మారింది. పిల్లల గదిలోకి వెళ్ళాడు. దోమతెరలలోపల పది సంవత్సరాల లోపు పిల్లవాడు, ఒక ఆడపిల్ల ఎనిమిదేళ్ళది గాఢనిద్రలో ఉన్నారు. వాళ్ళను మురిపెంగాచూశాడు.

తిరిగి తనగదిలోకి వచ్చి మంచమ్మీద పడుకున్నాడు. పక్కకు తిరిగి చూశాడు. పక్కమంచమ్మీద సౌగంధి అటు తిరిగి పడుకుంది. భార్యగా ఆమెను ఆదరించి, ఒకమంచి మాట మాట్లాడి, ఎంతకాలమయింది? ఆమె ఆ తిరస్కారా నికి తనను తాను తిట్టుకుని, తనకెదురుతిరిగి, తనతో ఘర్షణపడి, భోజనం చెయ్యకుండా కన్నీళ్ళు కార్చి, అలిసిపోయింది. ఇప్పుడామె మాట్లాడదు. మూగ మనిషిగా తనపట్ల ప్రవర్తిస్తుంది. కాని తల్లిగా పిల్లలపట్ల తన బాధ్యత నిర్వర్తి స్తుంది. ఇల్లాలుగా యింటిపట్ల తన కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నది. బల్లమీద పెట్టిన డబ్బుతో ఇంటిఖర్చులు చేస్తుంది. బంధువులు వస్తారు. పోతారు. తన జీవితంలోని వెలితి కనబడనీయదు.

సుధాకర్‌కి ఆమెత్తటి పరుపుమీద నిద్రరావటంలేదు. పైగా ముళ్ళమీద పడుకున్నట్టుంది.

ఏమిటీ ఈ అసాధారణ పరిస్థితి ?

ప్రతిరోజూ మాదిరిగా ఈనాడు అతడి దినచర్య జరగలేదు. అందుకే అతడిలో ఈమార్పు వాడెవరో గేటుముందరపడిపోతే మామూలుగా "ఈడ్చి అవతలపడెయ్యి" అనేవాడు. ఈ రోజు అట్లా అనలేదు. టీ గొంతులో పోయిం చాడు. అన్నంపెట్టించాడు. తనలోని ఈ మనిషిచచ్చిపోయి ఎంతకాలమయింది?

క్లబ్బులో తనకివాళ జరిగింది గౌరవంకాదు-అవమానం.

తనతోఆప్యాయంగా మాట్లాడుతూ, స్నేహంనటిస్తూ, తనను మోసంచేసి, రోజుకు రెండుమూడువందలు గుంజేస్తున్నా తను ఎందుకు తెలుసుకోలేక పోయాడు? పక్కగదిలో ఆడపిల్లలనుఉంచి వాళ్ళచేత బీర్ తెప్పించి, తనచేత రెండుసీసాలుతాగిస్తుంటే ఎలాతాగాడు వద్దనకుండా? నెరజాణలయిన ఆ ఆడపిల్లలతో తను గంటలకొద్దీ కాలక్షేపంచేశాడే? తన తెలివి ఏమయింది?

ఇంతకాలంనుంచీ స్నేహితులు ఆడినఆటంతా మోసమేనని తెలుసుకోలేక పోయాడెందుకని?

వాళ్ళ తీపిమాటలా?

మందు మహిమా?

ఆడపిల్లలను ఎరచూపినందువల్లనా?

తన చదువూ-తన పరిపాలనా దక్షతా - పెద్దఉద్యోగం - పేరూ - ప్రతిష్ఠా- వీటిలో ఏవీ అడ్డుపడలేదే? ఎంత చిత్రంగాఉంది?

ఇవాళజేబులో రెండువందలకంటె ఎక్కువలేవు లేవన్నందుకు జరిగిన అవమానానికీ, నోటికందని మందువల్లా చేతికందని ఆడపిల్లల తిరస్కారంవల్లా కళ్ళు తెరుచుకున్నాయా?

లేచి ఆఫీసురూమ్‌లోకి వెళ్ళాడు. అపూర్వమైన ఉద్గ్రంధాలు ఎన్నుకొని చదివేఅలవాటు తనకుండేదో షెల్ఫుల్లో ఉన్నగ్రంథాలు జ్ఞాపకంచేశాయి. అవేవీ తనకు ఉద్బోధచెయ్యలేదా? తనను సంస్కరించలేదా? ఒక్కొక్కటి పదేసిసార్లు చదివి ముఖ్యాంశాలను పెన్సిల్‌తో గీతలుపెట్టాడే?

ఇప్పుడవి తెరిచిచూసిన కళ్ళు-వెలవెల పోయాయి.

అతడిలో ఇంతకాలం చచ్చిపోయినట్లున్నమనిషి తిరిగి ప్రాణం పోసుకుంటున్న సూచనలు కనబడ్డాయి.

వీటన్నిటినీ తనకు దూరంచేసినవాటిని ఈరోజే తను వెతికిపట్టుకున్నాడు.

ఇంక తన నారాధించి ప్రేమించే సౌగంధి కిన్నెరకంఠంతో పాడేపాటలు రోజూ సాయంత్రపువేళ తను అరమోడ్పుకళ్ళతోవినాలి. పిల్లల ముద్దుమాటలువింటూ-వాళ్ళ చిన్నచిన్న కోరికలూతీరుస్తూ -వాళ్ళతో ఆడుకుంటూ మధురమైన జీవితం గడపవచ్చు.

తనజీవితంలో ఎంతకాలం వృధాగా గడిచిపోయిందోననుకుంటే సుధాకర్‌కి గుండెలయ తప్పినట్లయింది.

పక్కమీద దొర్లిదొర్లి ఏ తెల్లవారుఝాముకో నిద్రలోకి జారుకున్నాడు.

సుధాకర్ నిద్రలేచేసరికి ఎనిమిదిగంటలు దాటింది. లేచి స్నానంచేసి కాఫీ తాగి ఆఫీసురూంలోకూర్చుని పేపరు చేతబట్టాడు.

అంతలో టెలిఫోను మోగింది.

అతడు రిసీవరుఎత్తగానే కిన్నెరకంఠం ఒకటి.

"హలో గుడ్‌మార్నింగ్‌సర్" వినబడ్డది.

"మార్నింగ్"

"ఇవాళ తొమ్మిదిగంటలకు కమిటీఉంది. ఫైల్సు తయారుగాఉన్నాయి. మీరు ఆఫీసుకు తొందరగా రావలసిఉంటుంది"

"ఓ. కే."

"దారిలో నన్ను పికప్ చేసుకుంటారుగా?"

"ష్యూర్ ష్యూర్"

అతడిలో చచ్చిపోయిందనుకున్న ఉత్సాహం చివ్వున పైకిలేచింది. తిరిగి ప్రాణం పోసుకుంటున్నదనుకున్న లోపలిమనిషికి స్పృహతప్పింది.

టిఫిన్‌తినకుండానే కారుడ్రైవ్ చేసుకుంటూవెళ్ళాడు. తన ఆఫీసు సెక్రెటరీ అండాళ్ళును ఎక్కించుకుని ఆఫీసుకువెళ్ళాడు. ఆమెను చూడగానే పొంగిన ఉల్లాసంతో కమిటీరూంలోకూర్చుని ఫైల్సు తిరగవెయ్యటం మొదలుపెట్టాడు.

ఆఫీసువాతావరణం ఒక స్వర్గధామంలా ఉంటుంది. కమిటీ సభ్యులు ఒక్కొక్కరేవచ్చారు. బ్రేక్‌ఫాస్టు టీలు అయ్యాయి. అందరూకలిసి పొగాకు అమ్మకం విషయంలో ఒక నిర్ణయం తీసుకున్నారు. ఆ తరువాత గంటకు కొనుగోలుదార్లువచ్చారు. విందులూ కాక్‌టేల్ పార్టీ జరిగాయి. కాంట్రాక్టు సుధాకర్‌కి అనుకూలంగా అండాళ్ళు కుదిర్చింది, సంతకాలయ్యాయి. కరచాలనంచేసి వాళ్ళు వెళ్ళారు.

పార్టీ అయినతరువాత అండాళ్ళు తనవంతుడబ్బు పర్సులో పెట్టుకుని మిగిలినడబ్బు బాస్ ముందర పెట్టింది. అతడు ఆమెను ముగిపెంగాచూస్తూ లెక్కబెట్టుకోకుండా జేబులో కుక్కుకున్నాడు.

పొగాకు కంపెనీలలోకల్లా ఆ కంపెనీ చాలా ఘనమైంది. ఆకంపెనీలో ఎక్కువషేర్లు సుధాకర్ కుటుంబసభ్యులవి.

సుధాకర్ ఇప్పుడు కొత్తక్లబ్బులో చేరేటట్టు అండాళ్ళు ఏర్పాటుచేసింది. కొత్తస్నేహితులు - కొత్తవాతావరణం - అండాళ్ళు అతడిని వెయ్యికళ్ళతో కని పెట్టి చూసేచూపు అతడిలోని ఉత్సాహాన్ని ఇనుమడింపచేశాయి.

ఈ వాతావరణంలో అతడి జేబులోని వందరూపాయలనోట్లు తరగటం లేదు. కాని షేర్లు తగ్గిపోతున్నాయి. అండాళ్ళు తన పర్యవేక్షణలో కొత్తకొత్త కాంట్రాక్టులు కుదురుస్తోంది. దానిలో అతడికి వచ్చే కమీషన్ నామమాత్రంగా ఉంటోంది.

సుధాకర్ భోజనం రాత్రిళ్ళు అండాళ్ళుఇంట్లో, జిన్‌వేసిన మందుతో ఖుషీ చేసుకుని ఒకనిద్రతీసి, ఇంటికి బయలుదేరుతాడు. అదిగో - అప్పుడే అతడిని ఇంట్లోకి తీసుకురావటానికి ఇద్దరు మనుష్యులు అవసరమవుతారు.

సౌగంధి తన ప్రపంచంలో తనుంటుంది. ఆనాడామె తోటలో సిమెంటు బెంచీమీద కూర్చుని భజనలు పాడుకుంటుండగా జోగులు వచ్చి ఆమెకు దణ్ణం పెట్టాడు.

"ఎవరునీవు ? ఏంకావాలి ?" అడిగింది సౌగంధి.

"అమ్మా, నన్ను అయ్యగారు తోటపనిచేస్తూ ఆమూల కొట్టిడిలో ఉండ మన్నారు. ఇదిగో ఇది మాఆడది. ఇంటిపనిచెయ్యమని అయ్యగారు చెప్పారు."

జోగులు భార్య మంగమ్మ ఆరోజే ఊరినుంచి వచ్చింది. భార్యాభర్తలకు పనులు పురమాయించి జీతంకూడా కరారుచేశాడు సుధాకర్.

ఇదంతా ఆండాళ్ళు టెలిఫోను చేయకముందు సంగతి.

జోగులు దంపతులకు ఒక కొట్టిడీ నూరురూపాయలజీతం, దానితో జొన్న గటక చేసుకుని తింటూ - ఊసులాడుకుంటూ పనులు చేసుకుంటూ సాయంత్ర మయే సరికల్లా కొట్టిడీ ముందర ఈతాకులచాప పరచుకుని కూర్చుంటారు. వాళ్ళ పకపకలూ - సరాగాలూ - ప్రణయకలహాలూ - అలకలూ - బతిమిలాటలూ అప్పుడప్పుడు సౌగంధి చెవిలో పడుతూ ఉంటాయి.

ఆమె అటువంటి సందర్భాలలో కళ్ళు విశాలం చేసుకుని చూస్తుంది. ఇద్దరివీ చింపిరి దుస్తులు. జొన్నగటకతప్ప వరిఅన్న మెరుగరు. ప్రకృతి సంపద ఎండకూ వానకూ వాళ్ళదేహాలు అలవాటు పడ్డాయి. చలికి అతడు తలకు బట్ట చుట్టుకుంటాడు. ఆమె ఆ చింపిచీరే తలమీదికి లాక్కుంటుంది.

వాళ్ళ సంతోషం సహజమైనది - ప్రకృతి సిద్ధమైనది. కాని - ఏదో గొప్ప అనుభవం వల్ల కలిగినదిగాని గొప్ప అదృష్టంచేత కలిగినది గాని కాదు.

వాళ్ళ నవ్వులుకూడా సహజమైనవే. సహజంగా ఆయా పరిస్థితులలో కలిగే మనోభావాలవల్ల కలిగిననవ్వులుకాని కృత్రిమంగా తెప్పించుకున్నవికావు.

వాళ్ళకూ తమకూ ఎంతతేడా ? వాళ్ళు - వాళ్ళే సహజమైన ప్రకృతి సిద్ధ మైన సంపన్నులు.

వాళ్ళ సహజమైన ఆనందానికి ధనధాన్యాలు భోగభాగ్యాలూ కావాలా ?

భోగభాగ్యాలతో కొన్న ఆనందం ఎంతకాలం ఉంటుంది ? ఎంతసేపు ఉంటుంది ?

అటువంటిభాగ్యం తన జీవితంలో ఒక్కనాడైనా లభ్యమయ్యే అవకాశం ఉందా ?

వాళ్ళను చూసి పరవశించిపోయిన సౌగంధిమనసు క్షణంలో ఉసూరమంటుంది.

ఆమె బరువుగా నిట్టూర్చి తంబురాను తను పాడబోయే భజనలకు అనుకూలమైన శృతి చేసుకుంటుంది.

ఆ రాగంలో ఆమె లీనమై అలౌకికమైన ఆనందాన్ని పొందుతుంది.